రేపు ఉగాది వేడుకలు

మోతీనగర్‌: పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని సాయంత్రం 5.30 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించ నున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి. సుధాకర్‌, ఆలయ కమిటీ అధ్యక్షులు బాకారం బుచ్చయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా శ్రీరామనవమి వసంత నవరాత్రోత్సవాలు 30వ తేదీ నుంచి ఏప్రిల్‌ 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌ 6న సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించను న్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామి వార్ల ఊరేగింపు, 9 గంటలకు ఎదుర్కోలు, 10 గంటలకు కల్యాణం, 12 గంటలకు అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు రవీంద్ర భారతిలో ఉగాది పురస్కారాలు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీసాయి అలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది పురస్కారాలు 2025, ఉగాది బాల, గురు వందన పురస్కారాల ప్రదానోత్సవం శనివారం రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేష్‌ రెడ్డి, టూరిజం కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ వెన్నెల గద్దర్‌, శేషగిరిరావు, వెంకటేష్‌గౌడ్‌, ప్రత్యేక అతిథిగా గాయని మధుప్రియ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా ఇఫ్తార్‌ విందు

మోతీనగర్‌: ఇఫ్తార్‌ విందులు మత సామరస్యానికి నిదర్శనమని ఆయా డివిజన్ల కార్పొరేటర్లు అన్నారు. గురువారం రాత్రి అల్లాపూర్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ సబిహా బేగం, మైనార్టీ సెల్‌ అధ్యక్షులు మహ్మద్‌ గౌసుద్దీన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందుకు నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల కార్పొరేటర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌ గౌడ్‌, ఆవుల రవీందర్‌ రెడ్డి, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, మైనార్టీ నాయకులు, బీఆర్‌ఎస్‌ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌ ప్రధాన రోడ్డులోని శ్రీపర్వతవర్ధిని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అవినాష్‌ శర్మ మాట్లాడుతూ.. తరచు హోమాలు, యజ్ఞాలు నిర్వహించటం వల్ల సుఖ సంతోషాలతో ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉన్నా తీరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని అన్నారు.

నల్ల చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువు నుంచి నీటిని తొలగించారని, దీంతో చుట్టుపక్కల కాలనీల్లో భూగర్భ జలాలు తగ్గాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా బతుకమ్మ కుంట అభివృద్ధి ప్రతిపాదనకే పరిమితమైందని, ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

నేడు 'డయల్‌ యువర్‌ డీఎం'

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్‌ హరి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్‌లో సంప్రదించాలన్నారు. డిపో పరిధిలో బస్సుల సమస్యలు, సమయాలు, బస్‌బేలో బస్సులు నిలపకపోవడం, బస్‌ షెల్టర్లు వంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని ఆయన తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకోవటమే కాకుండా సలహాలను స్వీకరిస్తామన్నారు. ఫోన్‌ నంబర్‌ 9959226151 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వేసవి క్రీడలకు మైదానాలు సిద్ధం!

● పరీక్షలు ముగిసిన వెంటనే శిక్షణ ప్రారంభం ● క్రికెట్‌కు రూ.50, ఇతర క్రీడలకు రూ.10 నామినల్‌ ఫీజు

చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది మైదానాలు ముస్తాబవుతున్నాయి. విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరాలు నూతన ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించగానే శిక్షణ తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



కేపీహెచ్‌బీకాలనీలో బాస్కెట్‌బాల్‌ గ్రౌండ్‌లో ప్రాక్టీస్‌ చేస్తున్న యువకులు

కేపీహెచ్‌బీకాలనీ: జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్‌ పరిధిలోని మూసాపేట సర్కిల్‌ కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌లో క్రీడా మైదానాలు దాదాపుగా సిద్ధమయ్యాయి. గత ఏడాది శిక్షణ శిబిరాల్లో 200 మందికి పైగా పాల్గొన్నారు. 9 నుంచి 16 ఏళ్ల వయస్సు పిల్లలకు మాత్రమే శిక్షణ ఇస్తారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

ప్రతి యేటా కేపీహెచ్‌బీ కాలనీలోని 7 ఫేజ్‌లో బాస్కెట్‌బాల్‌ మైదానం, క్రికెట్‌ మైదానంలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తారు. ఇక్కడ బాస్కెట్‌ బాల్‌తో పాటు టెన్నిస్‌, వాలీబాల్‌, షటిల్‌ కోర్టులు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా క్రికెట్‌ క్రీడా మైదానం అందుబాటులో ఉండటంతో శిక్షణ పొందేందుకు పెద్ద ఎత్తున చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

రమ్యా గ్రౌండ్స్‌లో..

మూడవ ఫేజ్‌ రమ్యా మైదానం క్రీడలకు అడ్డాగా మారింది. ఇక్కడి రెండు వేర్వేరు మైదానాల్లో బాడ్మింటన్‌, షటిల్‌, వాలీబాల్‌ క్రీడలకు శిక్షణ ఇస్తారు. ఫేజ్‌ వన్‌ అండ్‌ టూ లోని పార్కులో వాలీబాల్‌ గ్రౌండ్‌, ధనలక్ష్మి గ్రౌండ్‌లో వాలీబాల్‌, భువన విజయం గ్రౌండ్‌లో క్రికెట్‌, టెన్నిస్‌, వాలీబాల్‌ తదితర క్రీడలకు సంబంధించిన శిక్షణ అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. వీటితో పాటుగా కేపీహెచ్‌బీలోని ఇండోర్‌ స్టేడియంలో షటిల్‌ శిక్షణ ఇవ్వనున్నారు.

వచ్చే నెలలో ప్రారంభం

ఏప్రిల్‌ మొదటి వారంలో వేసవి శిక్షణా తరగతులకు ఆన్‌లైన్‌ ద్వారా పేర్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. అనంతరం 20వ తేదీ తరువాత శిబిరాలను మైదానాల వారీగా ఎంపిక చేసి అందుకు తగ్గ క్రీడా పరికరాలను సమకూర్చనున్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి జోన్‌ పరిధిలోని క్రీడా మైదానాల వారీగా అవసరమయ్యే క్రీడా పరికరాల వివరాలను అధికారులు సేకరించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8.15 వరకు క్రీడలకు సంబంధించి ఆయా కోచ్‌ల ద్వారా శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ నామినల్‌ ఫీజు రూపంలో డబ్బులు వసూలు చేస్తారు. క్రికెట్‌ శిక్షణకు రూ.50, ఇతర క్రీడలకు రూ.10 చొప్పున తీసుకోనున్నట్లు కూకట్‌పల్లి జోన్‌ క్రీడల విభాగం అధికారి వీరానంద్‌ 'సాక్షి'కి తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిక్షణతో క్రీడా స్ఫూర్తి మరింత పెరుగుతుంది. ఆరోగ్య సంరక్షణ, మానసిక ఉల్లాసం, క్రమ శిక్షణ అలవాటు అవుతుంది. తల్లిదండ్రులు పిల్లలను వేసవి సెలవుల్లో క్రీడా శిబిరాలలో భాగస్వాములను చేయాలి. ప్రస్తుతం పిల్లలు పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

– అంజిబాబు, బాస్కెట్‌బాల్‌ కోచ్‌

ఏర్పాట్లు భేష్‌



వేసవి శిక్షణ శిబిరాల కోసం అధికారులు మైదానాలు శుభ్రం చేసి సిద్ధం చేయడం సంతోషం. కాంక్రీట్‌ జంగిల్‌గా మారిన నగరంలో క్రీడల కోసం మైదానాలు సిద్ధం చేయడం, చిన్నారులను మంచి క్రీడాకారులుగా తయారు చేసేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవటం అభినందనీయం. స్థానిక అధికారులు ప్రోత్సాహంతో చిన్నారులు సైతం క్రీడల్లో భాగస్వాములు అయ్యేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

–లక్ష్మీనారాయణ

రేషన్‌ షాపులకు సన్న బియ్యం

పేదలకు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి ఆహార భద్రత కార్డు ఉన్న వారికి రేషన్‌ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి పక్క జిల్లాల్లోని మండలస్థాయి గోదాముల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా రేషన్‌ దుకాణాల్లోకి చేరవేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని అర్బన్‌ ప్రాంతాలకు ప్రతినెలా రేషన్‌ పంపిణీ ఆలస్యం అవుతోంది. అన్నిచోట్లా నెల ప్రారంభం నుంచి సరకులు ఇస్తుండగా.. కొన్ని పురపాలక సంఘాల్లో మాత్రం రెండో వారం ప్రారంభిస్తున్నారు. ఈ సారి కూడా ఆలస్యం చేస్తారా.. అనుకున్న సమయానికి పంపిణీ చేస్తారా? అనేది చూడాల్సి ఉంది. రేషన్‌ కార్డులో ప్రతి సభ్యుడికి ఉచితంగా ఆరు కిలోలు అందజేస్తారు.

ఎన్నికల హామీ మేరకు..

బయటి మార్కెట్లో సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఇది వరకు రేషన్‌ దుకాణాల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అమ్మేసి ఆ డబ్బులతో సన్న బియ్యం కొనుగోలు చేసే వారు. దీంతో రేషన్‌ బియ్యం పక్కదారి పట్టేది తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఏడాది దాటిన తర్వాత సన్న బియ్యం పథకం అమలుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ ప్రక్రియతో అక్రమాలకు చెక్‌ పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా..

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాయి. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు రేషన్‌ దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. దొడ్డు రకం బియ్యం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపకపోవడం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అక్రమాలకు అడ్డుకట్ట

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో చాలా కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తుండటంతో.. దొడ్డు బియ్యం అక్రమార్కులకు వరంలా మారుతోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ.. రూ.లక్షల్లో అక్రమ దందా సాగిస్తున్నారు. అధికారులే కొన్ని చోట్ల అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, పలువురు రేషన్‌ షాపు డీలర్లు కూడా వంతపాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రేషన్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేసి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం ఈ అక్రమ దందాను నిలువరించేందుకే రేషన్‌ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తోంది.

5.23 లక్షల మందికి కార్డులు

మేడ్చల్‌ జిల్లాలోని 619 రేషన్‌ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్‌ కార్డు దారులకు ప్రతినెలా ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు(యూనిట్లు) ఉండగా, ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్‌ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా.. ఏప్రిల్‌ నుంచి రేషన్‌ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందించేందుకు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా

కుత్బుల్లాపూర్‌: ఆపదలో ఉన్న నిరు పేదలకు ఆర్థిక, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం రిలీఫ్‌ఫండ్‌ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. గాజుల రామారం డివిజన్‌ ఇందిరా నగర్‌కు చెందిన ముత్తుస్వామికి రూ. 2 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. శుక్రవారం పేట్‌ బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో లబ్ధిదారుడికి ఎల్‌ఓసీని అందజేశారు. బీఆర్‌ఎస్‌ జగద్గిరిగుట్ట డివిజన్‌ అధ్యక్షుడు రుద్ర అశోక్‌, కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సాయికిరణ్‌, ఇమ్రాన్‌ బేగ్‌ పాల్గొన్నారు.

ఒత్తిడి భరించలేక వ్యక్తి అదృశ్యం



వంశీకృష్ణ (ఫైల్‌)

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటి లోన్‌ వాయిదాలు చెల్లించాలని తమ్ముడు, అతని భార్య ఒత్తిడిని భరించలేక ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏర్పుల వంశీకృష్ణ భార్యతో కలిసి కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్‌ హాస్టల్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను, తమ్ముడు రాధాకృష్ణ కలిసి స్వగ్రామం బాటసింగారంలో లోన్‌ తీసుకుని ఇంటిని నిర్మించారు. ఇంటి లోన్‌ వాయిదాల విషయంలో అన్నాదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో వంశీ కృష్ణ భార్యతో వచ్చి హాస్టల్‌లో ఉంటున్నాడు. లోన్‌ విషయంలో తమ్ముడు ఒత్తిడి చేయడంతో వంశీకృష్ణ.. శుక్రవారం హాస్టల్‌ నుంచి ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం అతని ఫోన్‌స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. తరువాత వేరే నెంబర్‌ నుంచి తన భార్య ఫోన్‌కు 'లోన్‌ కట్టాలని తమ్ముడు, అతని భార్య ఒత్తిడి తెస్తున్నారని, కట్టకపోతే చనిపోతానని బెదిరిస్తున్నారని, ఆ ఒత్తిళ్లను తట్టుకోలేక తానే చావడానికి వెళ్తున్నా' అని వాట్సాప్‌ మెసేజ్‌ పంపాడు. దీంతో ఆందోళనకు గురైన వంశీ కృష్ణ భార్య శాలిని కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌



బాలానగర్‌: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. శుక్రవారం బాలానగర్‌ పార్టీ కార్యాలయంలో చెక్కులను అందజేశారు. మూసాపేటకు చెందిన గొలుసుల నర్సింగరావుకు రూ.60 వేలు, రఫియా బేగంకు రూ.60 వేలు, బాలానగర్‌కు చెందిన బాతుల చంద్రకళకు రూ. 60 వేల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, కుక్కల రమేష్‌, షకీల్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

మూసాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కైత్లాపూర్‌లోని లిక్కర్‌ మార్టు వద్ద ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తికి సుమారు 40–45 సంవత్సరాలు ఉంటాయని, చుట్టు పక్కల సీసాలు, డబ్బాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తూ రోడ్డు పక్కనే పడుకుంటాడని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఉదయ్‌భాస్కర్‌ (ఫైల్‌)

కేపీహెచ్‌బీకాలనీ: డబ్బు పని మీద బెంగుళూరుకు వెళ్లానని, రెండు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీకాలనీ మలేసియా టౌన్‌షిప్‌లో తన స్నేహితులు అశోక్‌, వినోద్‌లతో కలిసి ఉదయ్‌భాస్కర్‌ ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఉదయ్‌భాస్కర్‌కు తన బావ బుట్ట సురేష్‌ ఫోన్‌ చేయగా.. తాను డబ్బు పని మీద బెంగుళూరుకు వచ్చానని, రెండు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పాడు. ఆ తర్వాత ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ వచ్చింది. పది రోజులు గడిచినా తిరిగి రాకపోవడంతో ఉదయ్‌భాస్కర్‌ రూమ్మేట్స్‌ను ఆరా తీయగా.. తమతో కూడా కాంటాక్ట్‌లో లేడని చెప్పారు. దీంతో బావ సురేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాక్షి' ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

నిజాంపేట్‌ : తెలుగు వారి నూతన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ మీడియా సంస్థ 'సాక్షి' ఆధ్వర్యంలో మార్చి 30న బాచుపల్లి, క్రాంతి నగర్‌ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాంగ శ్రవణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శుక్రవారం ముందస్తు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రముఖ సంస్థ భారతీ సిమెంట్స్‌ ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. సిద్ధాంతి చక్రవర్తులు శ్రీవత్సాచార్యులచే పంచాంగ శ్రవణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రఖ్యాత నర్తకి యామిని రెడ్డి బృందం కళాత్మక కూచిపూడి నృత్యం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలు అందరూ ఈ ఉగాది పంచాంగ శ్రవణానికి హాజరవ్వాలని కోరారు.

అభాగ్యులకు అండగా సీఎంఆర్‌ఎఫ్‌

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి నిలుస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. 28 మంది లబ్ధిదారులకు రూ.12.21 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● పీఏసీ చైర్మన్‌ గాంధీ
● సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్‌ గాంధీ అన్నారు. 57 మంది లబ్ధిదారులకు రూ.23.24 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను శుక్రవారం కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నార్నే శ్రీనివాసరావులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు. ఈ పథకం నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. ఆర్థికసాయం మరింత పెంచేలా సీఎం రేవంత్‌రెడ్డిని కోరతానని తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌ రావు, పోతుల రాజేందర్‌, చిట్టిరెడ్డి శ్రీధర్‌ రెడ్డి, అనిల్‌ కావూరి, రాజు నాయక్‌, గణపతి, చంద్రమోహన్‌ సాగర్‌, పవన్‌ గౌడ్‌, శివసాగర్‌, శ్రావణిరెడ్డి, మంజుల, చర్ల రామకృష్ణారెడ్డి, నరసింహ, దేవేందర్‌రెడ్డి, ఎడ్ల సంపత్‌రెడ్డి, సందీప్‌ గుప్తా, చిట్టి రెడ్డి గోపాల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సతీష్‌ గౌడ్‌

బాలానగర్‌: ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ అన్నారు. ఫతేనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఎల్‌బీఎస్‌ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను ఎల్‌బీఎస్‌ నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు కుతాడి రాములు సన్మానించారు. కార్యక్రమంలో శివశంకర్‌ గౌడ్‌, శంకర్‌, బెట్టు శ్రీను, ముజ్జు, శ్రీనివాస్‌, గిరి, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ విలియం ప్రకాష్‌



ర్యాలీ నిర్వహిస్తున్న వాటర్‌ వర్క్స్‌ మేనేజర్‌ విలియం ప్రకాష్‌ తదితరులు

మూసాపేట: అపార్టుమెంట్‌లలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని మూసాపేట వాటర్‌ వర్క్స్‌ మేనేజర్‌ విలియం ప్రకాష్‌ అన్నారు. శుక్రవారం బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఆంజనేయ నగర్‌కాలనీలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా వర్షాకాలంలో నీరు ఇంకుడు గుంతల్లో ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. నీటిని ఒడిసి పట్టుకోకపోతే భవిష్యత్‌ తరాలకు నీటి సమస్య తీవ్రంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మూసాపేట వర్క్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వినయ్‌, సిబ్బంది రాజు, పోచయ్య, రమేష్‌, సుజన్‌, రవి, అరవింద్‌ తదితరులు పాల్గొన్నారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా గోవర్ధన్‌ రెడ్డి



అసోసియేషన్‌ నూతన కార్యవర్గ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కోర్టు బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా పి. గోవర్ధన్‌ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. అదే విధంగా ఉపాధ్యక్షుడిగా కె. భీమయ్య, జనరల్‌ సెక్రటరీగా సుదర్శన్‌ రెడ్డి, జాయింట్‌ సెక్రటరీగా హర్షవర్ధన్‌ రెడ్డి సంద్రు, ట్రెజరర్‌గా షరీఫ్‌, లైబ్రరీ సెక్రటరీగా ఎం. లావణ్య, స్పోర్ట్స్‌ అండ్‌ కల్చరల్‌ సెక్రటరీగా సురేష్‌ కమ్మెట, మహిళా సెక్రటరీగా బి.వి.ఎస్‌.ఎల్‌. లత, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా జే. అఖిలరావు, అర్చన గౌడ్‌, కల్యాణి, తన్నీరు శ్రీకాంత్‌, పద్మావతి, రామకృష్ణ, భాను ప్రసాద్‌ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్‌ న్యాయవాది సుభాష్‌ గుప్తా తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌

పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ





ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, ముస్లింలు

ఆల్విన్‌కాలనీ: మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌ అని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శుక్రవారం ఎల్లమ్మబండ ఈద్గాలో కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దవాత్‌–ఏ–ఇఫ్తార్‌ విందు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రంజాన్‌ మాసం చాలా పవిత్రమైనదని అన్నారు. పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. కులం, మతం, జాతి బేధం లేకుండా అంతా ఒక్కటే అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.